క్లుప్తంగా

ఆర్థికసాయం



వాజేడు: గుండెపోటుతో మృతి చెందిన స్నేహితుడు సానప తిరుపతి కుటుంబానికి మిత్రులు ఆదివారం ఆర్థికసాయం అందించారు. మండలంలోని చెరుకూర్రు గ్రామానికి చెందిన తిరుపతి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. 1991–92 ఏటూరునాగారంలో 10వ తరగతి చదివిన బ్యాచ్ స్నేహితులు రూ.17,100 బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో కిషన్ రావు, మహేష్, రవీందర్, శ్రీనివాస్, చందు, వెంకటేశ్వర్లు, రజిత, విజయలక్ష్మి, స్వరూప రాణి, భవాని, విజయశ్రీ, రాజేశ్వరి, గోపి, గణేష్, భాస్కర్, సారయ్య, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ ఉన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

గోవిందరావుపేట : గ్రామీణ ప్రాంతాల్లో ఉండే నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 19న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ములుగు మండలం ఇంచెర్లలో ఉన్న ఎంఆర్ గార్డెన్‌లో 58 కంపెనీలు నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చింత క్రాంతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో విప్రో, ముత్తూట్ గ్రూప్స్, అపోలో ఫార్మసీ, వరుణ్ మోటర్స్, నెక్సా మోటార్స్, ఆక్సిస్ బ్యాంక్, వెబ్రో సాఫ్టెక్ సొల్యూషన్, మెడ్ ప్లస్, ఎక్సైట్ ఐ సొల్యూషన్, సెవన్ టెక్ ఐటీ సొల్యూషన్, శ్రీ చైతన్య విద్యాసంస్థలు వంటి కంపెనీలు మేళాలో పాల్గొంటున్నాయన్నారు. 7వ తరగతి నుంచి డిగ్రీతో పాటు వృత్తివిద్యా కోర్సులు చేసిన వారికి అర్హతను బట్టి ఇంటర్వ్యూ నిర్వహించి ఉద్యోగాల్లో చేర్చుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. గోవిందరావుపేట మండలంలోని నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్ మేళాలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రతీ సోమవారం విద్యుత్ ప్రజావాణి

మొగుళ్లపల్లి : విద్యుత్ వినియోగదారులకు చేరువయ్యే కార్యక్రమంలో భాగంగా వారి ఫిర్యాదులు తీసుకొని సకాలంలో పరిష్కరించేందుకు సబ్‌డివిజన్, డివిజన్ సెక్షన్ ఆఫీసుల్లో ప్రతీ సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ అడ్డగట్ల ప్రమోద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒకటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజావాణిని పటిష్ట పరచడంలో భాగంగా సమీక్షలు నిర్వహించి వినియోగదారులు చేసే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోబడతాయన్నారు. మండలంలోని వినియోగదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఏఈ కోరారు.

పాత్రాపురంలో గ్రామదేవతలకు పూజలు



వెంకటాపురం(కె): మండలంలో తొలకరి వర్షాలు కురవటంతో పాత్రాపురంలో ఓడ బలిజ కులసంఘం ఆధ్వర్యంలో రైతులు ఆదివారం గ్రామశివారులోని గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మేళతాళాలతో ఊరేగింపుగా గ్రామ దేవతల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని, పాడి, పంట చల్లగా కాపాడాలని తమ మొక్కులను చెల్లించుకున్నారు.

జలాభిషేకం



వాజేడు: మండలంలోని నాగారం గ్రామంలో ఆదివారం గ్రామదేవతలకు గోదావరి నీటితో జలాభిషేకం చేశారు. వర్షాలు కురవకపోవడంతో గ్రామ దేవతలు కరుణించాలని కోరుతూ జలాభిషేకం చేశారు. గోదావరికి వెళ్లి గంగా నీటిని తీసుకొచ్చి సీతారాములకు, హనుమంతుడికి, ముత్యాలమ్మకు, పోచమ్మకు జలాభిషేకం చేసి పూజలు నిర్వహించారు.



కనుమరుగైన వార సంత



సంతలో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు (ఫైల్)

- సొంత స్థలం లేక నిర్వహించలేకపోతున్న జీపీ
- మండలంలోనే చల్వాయిలో ఏర్పాటైన తొలి సంత
- కూరగాయలు కొనాలంటే 4 కిలోమీటర్లు వెళ్లాల్సిందే

గోవిందరావుపేట : ఒకప్పుడు ప్రజలు, వ్యాపారులతో కళకళలాడిన చల్వాయి వారంతపు సంత ఇప్పుడు కనుమరుగైంది. మండలంలోనే చల్వాయి గ్రామంలో ప్రారంభమైన తొలి సంత. అలాంటిది ఇప్పుడు కనుమరుగు కాబోతుంది. ప్రతి సోమవారం జరిగే సంతకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. చల్వాయి నుంచే కాకుండా చుట్టుప్రక్కల ఉన్న గ్రామాలైన మచ్చాపూర్, బుస్సాపూర్, దుబ్బగూడెం, సోమలగడ్డ, ఫ్రూట్ ఫారం గ్రామాల ప్రజలంతా వచ్చి కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకులలు కొనుగోలు చేసేవారు. దీంతో అప్పట్లో సంత జరిగే ప్రాంగణంతో పాటు చుట్టు ప్రక్కల ప్రదేశాల్లో కూడా వందల సంఖ్యలో దుకాణాలు వెలసి ప్రజలతో కళకళలాడేది. ఇది కనుమరుగు కావడానికి ప్రధాన కారణం గ్రామ పంచాయతీకి సొంత స్థలం లేకపోవడం. గతంలో కొన్నేళ్లుగా చల్వాయి మసీదు దగ్గర ప్రధాన రహదారిపై సంత జరిగేది. అది రోడ్డు విస్తరణ జరిగినప్పుడు జీపీ వారు అక్కడి నుండి తీసేసి చల్వాయి గిడ్డంగుల వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో లైట్లు ఏర్పాట్లు చేసి సంత జరిగేలా చర్యలు తీసుకున్నారు. అక్కడ కూడా సొసైటీ, మహిళ సంఘాలు ఆ ప్రదేశాల్లో షాపింగ్ కాంప్లెక్స్, సొసైటీకి సంబంధించిన గోదాములు, మహిళ సంఘం భవనాలు నిర్మించడంతో అక్కడి నుంచి సంత చల్వాయిలోని బస్టాండ్ ప్రాంగణంలోకి మార్చారు. రవాణాశాఖ వారు కూడా ఆ భూమి చుట్టూ ప్రహరీ వేసి హెచ్చరిక బోర్డు పెట్టడంతో వ్యాపారస్తులు చేతులెత్తేశారు. ప్రస్తుతం 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రంలో ప్రతి శనివారం జరిగే సంతకు ప్రజలు వెళ్లి సరుకులు కొనుగోలు చేసుకుంటున్నారు. జీపీ వారు, సంబంధిత అధికారులు వారంతపు సంత కొనసాగేలా సొంత స్థలాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చాలా సందడిగా ఉండేది



నేను గత 40 ఏళ్ల నుంచి కూరగాయల వ్యాపారం చేస్తున్నాను. ప్రతి సోమవారం ప్రాంగణమంతా చాలా సందడిగా ఉండేది. మాకు కూడా చాలా గిట్టుబాటు అయ్యేది. గ్రామపంచాయతీ వారు చొరవ తీసుకొని మళ్లీ సంత జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– పూజారి కళావతి, కూరగాయల వ్యాపారి

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చేస్తాం



చల్వాయి సంత విషయం గతంలో కూడా మా దృష్టికి ప్రజలు మా దృష్టికి తీసుకొచ్చారు. గ్రామ పంచాయితీ కి స్వంత స్థలం లేక సంత నిర్వహించ లేక పోతున్నారు. సొంత స్థలం సేకరణ కోసం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి శాశ్వతంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం

– జవహర్ రెడ్డి, ఎంపీడీఓ, చల్వాయి స్పెషలాఫీసర్

అనుకూల ప్రదేశం కోసం చూస్తున్నాం



చల్వాయిలో గత నాలుగేళ్ల క్రితం వరకు ప్రతి సోమవారం సంత జరిగేది. గ్రామ పంచాయతీకి సొంత స్థలం లేక సంత నిర్వహించ లేక పతున్నాం. గ్రామానికి మధ్యలో ప్రజలకు అనుకూలంగా ఉండే ప్రదేశం ఉంటే సంత నిర్వహించేలా ప్రయత్నం చేస్తున్నాం.

– చుంచు భారతి, గ్రామ కార్యదర్శి

ప్లాస్టిక్ నివారణకు సహకరించాలి



ప్లాస్టిక్ రహిత సంచులను వ్యాపారులకు అందజేస్తున్న జగ్గారావు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలో ప్లాస్టిక్ నివారణకు వ్యాపారులు సహకరించాలని సమ్మక్క–సారలమ్మ పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు కోరారు. ఆదివారం మేడారం అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో మేడారంలో ప్లాస్టిక్ నిషేధంపై యువకులు, పూజారులు కలిసి వ్యాపారులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ సంచుల వాడకానికి బదులు క్లాస్ సంచులను భూమిలో కలుషితమై క్లాత్ సంచులను వాడాలని వ్యాపారులకు సూచించారు. ఈ సందర్భంగా పూజారులు మాట్లాడుతూ పర్యావరణానికి ఎలాంటి హాని చేయని బయోడిగ్రేడ్బుల్ సంచులు వాడాలని సూచించారు. వ్యాపారులు ప్లాస్టిక్ సంచుల వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టిక్ నివారణలో వ్యాపారులు భాగస్వాములు కావాలని కోరారు. మేడారంలో వ్యాపారులు ప్లాస్టిక్ రహిత సంచుల కోసం 9553142346 నంబర్‌ను సంప్రదించాలన్నారు. పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, పూజారులు, అభ్యుదయ సంఘం యువకులు కలిసి క్లాత్ సంచులను ప్రారంభించారు.పూజారులు కొక్కెర రమేష్, కాక సారయ్య, గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన భోజరావు, ఉపాధ్యక్షుడు అలం వెంకటేష్, యువకులు పాల్గొన్నారు.

చెరువుశిఖం పట్టా రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దళితులు

చిట్యాల: మండలంలోని నవాబుపేట శివారులోని చెరువు శిఖం పట్టాను రద్దు చేసి కాస్తులో ఉన్న దళితులకు అందించాలని గ్రామానికి చెందిన చిలుముల రాజయ్య, చిలుముల శ్రీనివాస్, బొజ్జపల్లి భద్రయ్య , రాజయ్య, రవీందర్, శ్రీనాథ్, స్వరూపలు సంబంధిత అధికారులను కోరారు. ఆదివారం మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నవాబుపేట శివారులోని వంకసముంద్రం చెరువు శిఖంలో సర్వే నంబర్ 45లో గత పూర్వ కాలం నుంచి మా దళితులంతా కలిసి సాగు చేసుకుంటున్నామని తెలిపారు. కాగా అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కసిరెడ్డి సాయిసుధ భర్త కసిరెడ్డి రత్నాకర్‌రెడ్డి రెండు ఎకరాలకు పైగా పట్టా చేసుకున్నాడని వారు పేర్కొన్నారు. ఈ మేరకు ఆ చెరువు శిఖం భూమిలో నుంచి ప్రొక్లయినర్ సహాయంతో ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నాడని అన్నారు. ఆ మట్టిని తరలించవద్దని ఎంత చెప్పినా వినకుండా మాపై దుసురుగా ప్రవర్తిస్తున్నాడని పేర్కొన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమంగా పట్టా చేసుకున్న అతనిపై చర్యలు తీసుకోవాలని అలాగే దళితులకు ఆ భూమిని కేటాయించి న్యాయం చేయాలని వేడుకున్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న కుమార్, నాయకులు

కాటారం: జాతీయ సేవారత్న అవార్డు అందుకున్న మండల కేంద్రానికి చెందిన స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు కొట్టి సతీశ్, జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరి స్వామియాదవ్‌ను ఆదివారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మంథని నియోజకవర్గ అధ్యక్షుడు దుర్కి కుమార్ ఆధ్వర్యంలో అవార్డు గ్రహీతలను శాలువాలతో సన్మానించారు. వీరు చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ జాతీయ సేవారత్న అవార్డులు అందజేయడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో కవ్వాల శేఖర్, దుర్గం తిరుపతి, శ్రీధర్‌రెడ్డి, మంత్రి లక్ష్మణ్, వీరముష్టి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలి



సమావేశంలో పాల్గొన్న టఫ్ నాయకులు

కాళేశ్వరం: తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి ప్రభుత్వం వెంటనే గుర్తింపుకార్డులు ఇవ్వాలని, ఉద్యమకారుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని టఫ్ జిల్లా అధ్యక్షుడు గట్టయ్య యాదవ్ అన్నారు. ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం(టీయూఎఫ్) మండల స్థాయి సమావేశం మహాదేవపూర్‌లో అధ్యక్షుడు సట్ల సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు అయూబొద్దీన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ కార్యాచరణలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేయాలని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారందరిని గుర్తించి, రూ.10వేల కోట్ల బడ్జెట్ నిధితో ఉద్యమకారుల సంక్షేమ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని, పోలీస్ కేసులు ఉన్నవారితో పాటు, ఉద్యమంలో పనిచేసిన ప్రతి ఒక్కరిని గుర్తించాలని అన్నారు. ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని కోరిన చీమ శ్రీనివాస్ కార్యదీక్షతను తీర్మాణం చేయాలని కోరారు. కార్యక్రమంలో టఫ్ ప్రధాన కార్యదర్శి కలికోట దేవేందర్, ఉద్యమనాయకులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం కమిటీ ఎన్నిక

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో స్వయంకృషి మున్నూరుకాపు సంఘం సుభాష్ కాలనీలోని స్థానిక రామాలయంలో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం అధికార ప్రతినిధి సుంకరి గోవర్ధన్ తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా భాస్కరి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా దేవరకొండ మధు, మేడ వెంకటస్వామి, జనరల్ సెక్రటరీగా కొట్రంగి నాగార్జున, జాయింట్ సెక్రటరీగా గంపల దేవేందర్, ఆర్గనైజ్ సెక్రటరీ లట్ట శ్రీను, భాస్కరి భిక్షపతి, కోశాధికారిగా భాస్కరి సుధాకర్, సలహాదారులుగా తోట శ్రీనివాస్, లక్కం దేవేందర్, బర్ల రవీందర్, సూర బుచ్చన్న, భాస్కరి తిరుపతి కుమార్, సూరం రవీందర్ తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను సన్మానించామన్నారు.

బదిలీపై వెళ్తున్న సీఆర్పీఎఫ్ అధికారికి వీడ్కోలు



కాటారం: బదిలీపై వెళ్తున్న కాటారం సీఆర్పీఎఫ్ 58 బెటాలియన్ సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కోమల్ ప్రీత్‌కౌర్‌కు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం సీఆర్పీఎఫ్ అధికారులు, జవాన్లు ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోమల్ ప్రీత్‌కౌర్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కోమల్ ప్రీత్‌కౌర్ 2021 నుంచి ఇప్పటి వరకు మహాముత్తారం, కాటారం పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సీఆర్పీఎఫ్ బెటాలియన్‌కు అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వర్తించారు. విధి నిర్వహణతో పాటు సామాజిక సేవా, సివిక్‌యాక్షన్ ప్రోంగ్రామ్స్, విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమాల నిర్వహణతో ఈ ప్రాంతంలో ఆమె గుర్తింపు తెచ్చుకున్నారు. 2023 గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఢిల్లీలో పారా మిలిటరీ బలగాల తరపున ప్రదర్శించిన నారీశక్తి శకటానికి కోమల్ ప్రీత్ కౌర్ ప్రాతినిధ్యం వహించి ప్రశంసలు అందుకున్నారు. అంతేకాకుండా పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగేలా సివిల్ పోలీసులతో సమన్వయంతో పనిచేసి తనదైన పాత్ర పోషించారు. బదిలీ వీడ్కోలు సందర్భంగా పలువురు ఆమె సేవలను గూర్చి ప్రత్యేకంగా కొనియాడారు. సీఆర్పీఎఫ్ మహిళా అధికారిగా ఆమె సేవలు ఆదర్శనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ అధికారులు, జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కోతులకు ఆహారంగా అరటిపండ్ల అందజేత



భూపాలపల్లి రూరల్ : జిల్లా కేంద్రంలోని భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ సింగరేణి కాలరీస్ అసోసియేషన్ భూపాలపల్లి ఆధ్వర్యంలో ఆదివారం భూపాలపల్లి–కాటారం జాతీయ రహదారి వెంట మూగజీవాలు (కోతులు)లకు అరటిపండ్లు ఆహారంగా అందించారు. ఈ సందర్భంగా స్కౌట్‌అండ్ గైడ్స్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జీవాలకు పండ్లు అందించిన విధంగా ఈ ఏడాది కూడా 75 డజన్ల అరటిపండ్లు ఆహారంగా అందించడం జరిగిందన్నారు. కోతులను గ్రామల్లోకి రాకుండా అటవీ ప్రాంతాల్లో పండ్ల మొక్కలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ లీడర్స్ రాజమౌళి, స్కౌట్ అండ్ గైడ్స్ సిబ్బంది, రోవర్స్ పాల్గొన్నారు.

పోలీసు ప్రక్షాళన

- జిల్లాలో ఒకే రోజు సీఐలు, ఎస్సైల బదిలీలు
- ఒకే దగ్గర రెండేళ్ల పాటు ఎస్సైలు ఉండకుండా చర్యలు
- మల్టీజోన్–1 లెవల్‌లో ప్రత్యేక చర్యలు



ఎస్పీ శబరీశ్ చేతుల మీదుగా పతకాన్ని అందుకుంటున్న ఎస్సై వెంకటేశ్వర్లు

ములుగు: రాష్ట్ర వ్యాప్తంగా ఆయా శాఖల్లో బదిలీలు జరుగుతున్న విషయం విదితమే. పోలీసు శాఖలో సైతం ఏకకాలంలో భారీగా బదిలీలు జరగడం జిల్లాలో ప్రక్షాళన దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లుగా తెలుస్తోంది. మల్టీజోన్ లెవల్‌లో సీఐలను బదిలీలు చేస్తూ ఐజీ ఏవీ.రంగనాథ్ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. అదే రోజు అర్ధరాత్రి జిల్లాలో ఏడు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఎస్సైలను బదిలీ చేస్తూ మల్టీజోన్–1 ఐజీ, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఐజీ జోన్–1 కాళేశ్వరం, రామగుండం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సై స్థాయిలో ఏ అధికారి రెండేళ్ల కంటే ఎక్కువ సమయం ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే బదిలీ అయిన వారిలో చాలా మందికి ములుగు జిల్లాలోనే ఆయా పోలీస్‌స్టేషన్లకు పోస్టింగ్ ఇవ్వగా మిగతా వారిని వీఆర్‌కు అటాచ్ చేశారు.

సీఐల బదిలీలు ఇలా..

ములుగు సీఐగా ఉన్న రంజిత్‌కుమార్‌ను ఐజీ ఆఫీస్‌కి అటాచ్ చేశారు. పస్రా సీఐగా విధులు నిర్వహిస్తున్న వి.శంకర్‌ను ములుగు సీఐగా, సీసీఎస్ సీఐగా ఉన్న అనుముల శ్రీనివాస్‌ను ఏటూరునాగారం సీఐగా ఉన్న మండల రాజును ఐజీ కార్యాలయానికి అటాచ్‌గా, వెంకటాపురం(కె) బండారి కుమార్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. వెంకటాపురం(కె) సర్కిల్‌కి భద్రాద్రికొత్తగూడెం పీసీఆర్‌లో ఉన్న ముత్యాల రమేశ్ బదిలీపై రానున్నారు.

ఎస్సైల బదిలీలు

జిల్లాలోని చాలా మంది ఎస్సైలు గతేడాది జులైలో బాధ్యతలు తీసుకున్నవారే. వీరిలో జులై 21న ములుగు ఎస్సై వెంకటేశ్వర్, మంగపేట ఎస్సైగా 30న 2023లో బాధ్యతలు తీసుకున్న గోదారి రవికుమార్, అదే రోజు బాధ్యతలు స్వీకరించిన వెంకటాపురం(ఎం) ఎస్సై చల్ల రాజు, వెంకటాపురం(కె) ఎస్సై రేక అశోక్, పేరూరు ఎస్సైగా 31వ తేదీ జులై 2023లో గొర్ల రమేశ్ బాధ్యతలు తీసుకున్నారు. 1 ఫిబ్రవరి 2022న కన్నాయిగూడెం ముప్పు సురేశ్‌లను వీఆర్‌కు బదిలీ చేశారు. ఈయన ఒక్కరే రెండు సంవత్సరాల నాలుగు నెలల పాటు ఒకే స్టేషన్‌లో విధులు నిర్వహించారు. ఇక వాజేడు ఎస్సైగా 21వ తేదీ జులై 2023లో బాధ్యతలు తీసుకున్న వెంకటేశ్వర్‌రావును ములుగు ఎస్సై, ఏటూరునాగారం ఎస్‌హెచ్‌ఓ కృష్ణ ప్రసాద్‌ను పేరూరు ఎస్సైగా, ఇనిగాల వెంకటేశ్‌ను కన్నాయిగూడెం ఎస్సైగా, మల్టీజోన్–1లో వీఆర్ అటాచ్‌గా ఉన్న కె.తిరుపతిరావును వెంకటాపురం(కె) ఎస్సైగా, జక్కుల సతీశ్‌ను వెంకటాపురం(ఎం) ఎస్సైగా, మల్టీజోన్–4లో ఉన్న టీవీఆర్ సూరిని మల్టీజోన్–1 పరిధిలోని మంగపేట ఎస్సైగా, ములుగు వీఆర్‌లో ఉన్న తాజొద్దీన్‌ను ఏటూరునాగారం ఎస్సైగా, రుద్రారపు హరీశ్‌ను వాజేడు ఎస్సైగా బదిలీ చేశారు. కాగా ఏడాది మార్చి 11వ తేదీన బాధ్యతలు తీసుకున్న అచ్చ కమలాకర్ మాత్రం అదే పోస్టింగ్‌లో ఉన్నారు.

ఘనంగా గ్రామ దేవతల పండుగ



గుమ్మడి దొడ్డిలో పండుగ సామగ్రిని తీసుకొస్తున్న గ్రామస్తులు



పూసూరులో ఎల్లనంపుడు కార్యక్రమం

వాజేడు: మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి, పూసూరు గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతల (ఎల్లనంపుడు) పండుగను ఘనంగా నిర్వహించారు. వర్షాలు పడగానే వ్యవసాయ పనులకు సన్నద్ధం కావడం కోసం ముందస్తుగా ఈ పండుగను నిర్వహిస్తారు. అదే విధంగా గ్రామంలోనికి ఎలాంటి దుష్టశక్తులు రాకుండా ఉండటం, పంటలు పుష్కలంగా పండటం కోసం గిరిజనులు తమ సంప్రదాయ పద్ధతుల్లో ఈ పండుగను నిర్వహించారు. రెండు గ్రామాల ప్రజలు గ్రామదేవతల గుడి వద్ద నుంచి ఒక బేషన్‌లో విత్తనాలు, వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన పరికరాలను తీసుకుని వాటిపై కర్రలతో కొడుతూ ఊరి పొలిమేర వరకు తీసుకొచ్చారు. గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో అక్కడ చిన్న పందిరిని వేసి పూజలను నిర్వహించారు. చెక్కలతో తయారు చేసిన చిన్న బండిని పూజల అనంతరం గుడి వద్ద నుంచి తీసుకు వెళ్లి గ్రామ పొలి మేరలో ఉంచారు. అనంతరం మొక్కులను సమర్పించి పంటలు పుష్కలంగా పండాలని కోరుకున్నారు.

వాజేడు, పేరూరు ఎస్సైలుగా హరీష్, కృష్ణప్రసాద్



గుర్రం కృష్ణ ప్రసాద్



రుద్రారపు హరీష్



తిరుపతిరావు



టీవీఆర్ సూరి

వాజేడు : మండలంలోని వాజేడు, పేరూరు ఎస్సైలుగా రుద్రారపు హరీష్, గుర్రం కృష్ణ ప్రసాద్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పేరూరులో ఎస్సైగా పని చేస్తున్న గొర్ల రమేశ్‌ను ములుగు పంపించి వీఆర్‌లో ఉంచారు. వాజేడు ఎస్సైగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును ములుగు ఎస్‌హెచ్ఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏటూర్ నాగారం ఎస్సైగా పని చేస్తున్న గుర్రం కృష్ణప్రసాద్‌ను పేరూరు ఎస్సైగా నియమించారు. ములుగు వీఆర్‌లో ఉన్న రుద్రారపు హరీష్‌ను వాజేడు ఎస్సైగా నియమించారు.

వెంకటాపురం ఎస్సైగా తిరుపతి రావు

వెంకటాపురం(కె): వెంకటాపురం, ఎస్సైగా కొప్పుల తిరుపతిరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రేక అశోక్ బదిలీ చేయటంతో ఆయన స్థానంలో తిరుపతిరావును నియమిస్తున్నట్లు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

మంగపేట ఎస్సైగా సూరి

మంగపేట : మంగపేట పోలీస్‌స్టేషన్ ఎస్సైగా టీవీఆర్ సూరి నియమితులయ్యారు. జిల్లాలో పలు మండలాల ఎస్సైలను బదిలీ చేస్తు పోలీస్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2023 జులై 30 నుంచి మంగపేట ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న గోదరి రవికుమార్‌ను బదిలీ చేస్తూ ఆయన స్థానంలో ఎస్సైగా టీవీఆర్ సూరిని నియమిస్తు పోలీస్ శాఖ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయన ఒకటి రెండు రోజుల్లో పూర్తి బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–03లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకే చోట చేరి గత అనుభవాలు గుర్తు చేసుకున్నారు. 21 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరికొకరు పలకరించుకొని వారి జీవన స్థితిగతులు పంచుకుని రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, రాజేందర్, సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.